క్లుప్తంగా

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు



కె.అగ్రహారం(జగ్గయ్యపేట): ఈ నెల ఎనిమిది గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠించనున్న గ్రామ దేవతలకు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ముత్యాలమ్మ అమ్మవారితో పాటు సహ దేవతలు ఊరి ముత్యాలమ్మ, మద్ది రావమ్మ, మహాలక్ష్మమ్మ, సుబ్రహ్మణ్య స్వామి వారి విగ్రహాలకు గ్రామస్తులు జలబిందెలతో గ్రామోత్సవం నిర్వహించారు. అర్చకుడు రామకృష్ణ శాస్త్రి ఆధ్వర్యంలో ఊరేగింపు చేశారు.

బొడ్రాయికి జలాభిషేకం



మక్కపేట(వత్సవాయి): నూతన బొడ్రాయి (నాభిశిల) ప్రతిష్ఠోత్సవాలలో భాగంగా బుధవారం బొడ్రాయికి జలాభిషేకం నిర్వహించారు. గ్రామంలోని అయ్యప్ప ఆలయం వద్ద ఏర్పాటుచేసిన యాగశాల వద్దకు మహిళలు జలబిందెలతో నీటిని తీసుకువెళ్లి జలాభిషేకం చేశారు. వేదపండితులు యలమంచి కృష్ణ మూర్తి ఆధ్వర్యంలో అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం ఉదయం బొడ్రాయిని ప్రతిష్ఠించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతిష్ఠ అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు.

వెయిట్ లిఫ్టింగ్ విజేతకు సత్కారం



జయంతిపురం(జగ్గయ్యపేట): గ్రామానికి చెందిన గుగులోతు రాజశేఖర్ వెయిట్ లిఫ్టింగ్‌లో కాంస్యం సాధించటంతో గ్రామస్తులు బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఘోర్‌భాయ్ సేవా సంఘం అధ్యక్షుడు లాహోరు బద్దు నాయక్ మాట్లాడుతూ నోయిడా జీబీ నగర్‌లో గౌతమ్ బుద్ధా విశ్వవిద్యాలయంలో గత నెలలో జరిగిన ఖేలో ఇండియా యూనివర్సిటీ పోటీల్లో వెయిట్ లిఫ్టింగ్‌లో రాజశేఖర్ కాంస్య పతకం సాధించాడన్నారు. మారుమూల ప్రాంతానికి చెందిన రాజశేఖర్ ప్రభుత్వ ప్రోత్సాహంతోనే పతకం సాధించాడన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు భూక్యా కృష్ణ, సైదా, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వం కృషి

నందిగామ: ప్రభుత్వం మహిళల ఆర్థిక ఎదుగుదలకు కృషి చేస్తోందని కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్ అన్నారు. మండలంలోని మాగల్లు సహకార పరపతి సంఘం ద్వారా గ్రామానికి చెందిన ఐదు డ్వాక్రా గ్రూపులలోని 50 మంది మహిళలకు రూ.60 లక్షల రుణాలకు సంబంధించిన చెక్కులను బుధవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. డ్వాక్రా గ్రూపుల ద్వారా తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి పూర్ణచంద్రరావు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పుట్రేల మారెమ్మ హుండీ ఆదాయం రూ.5 లక్షలు

పుట్రేల (విస్సన్నపేట): మండలంలోని పుట్రేలలో ఉన్న మారెమ్మ దేవస్థానానికి చెందిన నాలుగు హుండీల్లో కానుకలు బుధవారం లెక్కించినట్లు ఆలయ ఈఓ వై. సీతారామయ్య తెలిపారు. విజయవాడ దేవదాయ శాఖ కార్య నిర్వహణాధికారి ఆర్.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కోటగిరి సునీల్ బాబు, ధర్మకర్తల మండలి సభ్యులు, పోలీస్, రెవెన్యూ అధికారులు, సత్యసాయి భక్త సమాజం సభ్యులు, భక్తుల సమక్షంలో లెక్కించారు. 47 రోజులకు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలు రూ.5,38,929 వచ్చినట్లు ఈఓ తెలిపారు.

కొండపల్లి సెక్షన్‌లో విద్యుత్ అధికారుల ఆకస్మిక తనిఖీ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): విద్యుత్ శాఖ అధికారులు కొండపల్లి సెక్షన్‌లో బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విద్యుత్ విజిలెన్స్ ఏడీఈ బి.నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో 40 బృందాలుగా ఏర్పడి చేసిన తనిఖీలు చేశాయి. నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్న 2,808 విద్యుత్ సర్వీసులు తనిఖీచేసి అపరాధ రుసుం రూ.6.10 లక్షలు వసూలు చేశారు. అధికలోడు వాడుతున్న వినియోగదారులు లోడును క్రమబద్ధీకరణ చేయించుకోవాలని సూచించారు. దాడుల్లో ఇబ్రహీంపట్నం ఏడీఈ కేవై కొండలరావు, ఈఈ జీబీ శ్రీనివాసరావు, కొండపల్లి ఏఈ సుబ్బారావు పాల్గొన్నారు.

రైతులకు పూర్తి స్థాయిలో సాగునీరు

బలుసుపాడు(జగ్గయ్యపేట): రానున్న వ్యవసాయ సీజన్ దృష్ట్యా రైతులకు పూర్తి స్థాయిలో సాగునీటిని అందిస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. గ్రామంలోని కాచవరం సప్లై చానల్‌లో రూ.15.35 లక్షల వ్యయంతో చేపట్టనున్న పూడికతీత పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాదిలో రైతులకు విత్తనాలు, ఎరువులను రైతు భరోసా కేంద్రాల ద్వారా సకాలంలో అందిస్తామని తెలిపారు. ఎప్పటికప్పుడు రైతులు ఆర్‌బీకేలలో సమాచారం తెలుసుకోవాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో రైతులు అన్ని విధాలుగా నష్టపోయారన్నారు. కానీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతు సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. రైతు భరోసాతో ఆర్థిక సహకారంతో పాటు యంత్ర పరికరాలను రాయితీపై అందిస్తున్నట్లు చెప్పారు. చంద్రబాబు మహానాడు వేదికగా మోసపూరిత హామీలిచ్చారని, చంద్రబాబును నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. నియోజకవర్గంలో పంట కాల్వల ఆధునీకీకరణ పనులకు శ్రీకారం చుట్టారని, దానిలో భాగంగానే మున్నేరు చానెల్ అభివృద్ధికి రూ.4.20 లక్షలు, పెనుగంచిప్రోలు బ్రాంచ్ చానెల్‌కు రూ.2.74 లక్షలు, రెబ్బవరం రూ.1.58 లక్షలు, పట్టణంలోని ఎర్రకాలవ, వేపలవాగు అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. పంట కాల్వలపై లస్కర్‌ల నియామకాలకు కూడా నిధులు కేటాయిస్తున్నామన్నారు. కాచవరం ఆయకట్టు కింద ఎనిమిది గ్రామాలకు 4,500 మంది ఆయకట్టు రైతులకు ఉపయోగం ఉంటుందన్నారు. అనంతరం పలువురు రైతులు కాచవరం కెనాల్ కట్టపై పంట పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని రహదారి ఏర్పాటు చేయాలని, సాగర్ నీరు విడుదల సమయంలో దిగువకు రాక పొలాలు ఎండుతున్నాయని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన 15 రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కేడీసీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, సర్పంచ్‌లు సూరిబాబు, లక్ష్మీత్రివేణి నాయుడు, మీగడ వెంకటేశ్వర్లు, సొసైటీ చైర్మన్ చలమాల శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ కుందవరపు కొండయ్య, మాజీ ఎంపీపీ మాతంగి వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మండవ శ్రీనివాస్ గౌడ్, డీఈ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కాచవరం సప్లయి చానెల్ పూడిక తీత పనులను ప్రారంభిస్తున్న విప్ ఉదయభాను

ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామటౌన్: దేవాలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. మండలంలోని కొత్త కంచల గ్రామంలో చేపడుతున్న వరసిద్ధి విఘ్నేశ్వర స్వామి వారి ఆలయ నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి, నూతన ఆలయాల నిర్మాణాలకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకోవటంతో పాటు నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. గ్రామంలో చేపడుతున్న ఆలయ నిర్మాణానికి రూ.38 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఏమాత్రం ఆదాయం లేని ఆలయాలకు సైతం ధూపదీప నైవేద్యం పథకం ద్వారా అర్చకులకు ప్రతి నెలా రూ.ఐదు వేలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి అని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కన్వీనర్ చలమల మధు, అంబారుపేట సత్యమ్మ అమ్మవారి ఆలయ మాజీ చైర్మన్ గరికపాటి భాస్కరం, పీఏసీఎస్ చైర్మన్ తాడపనేని సత్యనారాయణ, నాయకులు చలమల రామ్మూర్తి, రామిరెడ్డి వెంకటేశ్వర్లు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చేతల్లో చేసి చూపుతున్న సీఎం జగన్

గడపగడపలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

తిమ్మాపురం(వీరులపాడు): ప్రజా సంక్షేమం, అభివృద్ధి అని గత పాలకుల మాదిరిగా చెప్పటం కాకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతల్లో చేసి చూపుతున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని తిమ్మాపురం గ్రామంలో బుధవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించి సంక్షేమ పథకాల అమలు తేదీలతో కూడిన క్యాలెండర్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించి గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ముఖ్యంగా మహిళల సంక్షేమం, రక్షణకు ముఖ్యమంత్రి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని, ముఖ్యమంత్రి మహిళా పక్షపాతి అని అన్నారు. మహిళలకు ఏర్పాటు చేసిన దిశ యాప్ దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల మంచి కోరే ప్రభుత్వమని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు అన్నారు. మంచి చేస్తున్న ప్రభుత్వానికి రానున్న ఎన్నికలలో మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ మారపాక మహాలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ జంగా కోటిరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ఇప్పల సత్యనారాయణ రెడ్డి,, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్‌లు పాల్గొన్నారు.



జయంతి గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నేడు కంచికచర్లలో అభివృద్ధి పనులు ప్రారంభం

కంచికచర్ల: కంచికచర్ల గ్రామ సచివాలయం-1 పరిధిలో పలు అభివృద్ధి పనులను గురువారం ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు బుధవారం తెలిపారు. ఇటీవల అక్కడ జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలకు సంబంధించి ప్రస్తుతం ఈ అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. వీటిలో భాగంగా పాత శివాలయం సమీపంలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు తెలిపారు. మండల పరిషత్ నుంచి ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ మరో రూ.4 లక్షల నిధులు కేటాయించారని, ఆ నిధులతో సిమెంట్ రోడ్డు అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొనాలని వేమా తెలిపారు.

కుమ్మరి వాగు డొంక రోడ్డు ప్రారంభం

నందిగామ టౌన్: రైతు సంక్షేమం, శ్రేయస్సే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. చందర్లపాడు మండలంలోని కాండ్రపాడు గ్రామంలో మండల పరిషత్ నిధులు రూ.2 లక్షలతో అభివృద్ధి చేసిన కుమ్మరి వాగు డొంక రోడ్డును బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాండ్రపాడు కోనాయపాలెం గ్రామాల మధ్యనున్న కుమ్మరి వాగు డొంక రోడ్డు ధ్వంసమవటంతో పంట పొలాలకు రాకపోకలు చేసేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని రైతులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. వెంటనే యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుని, పనులు ప్రారంభించిన 15 రోజుల్లోనే అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావుకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాభివృద్ధి సంస్థ డైరెక్టర్ మంగునూరు కొండారెడ్డి, నాయకులు కొండా కృష్ణారెడ్డి, గుగులోతు లక్ష్మి, కమతం నర్సిరెడ్డి, వైఎస్ఎన్ ప్రసాద్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఉదయభానును కలిసిన పేట నూతన తహసీల్దార్

జగ్గయ్యపేటఅర్బన్: ఇబ్రహీంపట్నం తహసీల్దార్ పనిచేస్తూ బదిలీపై జగ్గయ్యపేట మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన మన్నె సూర్యారావు బుధవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉదయభాను ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

బైకులు ఢీ : దంపతులకు గాయాలు

తుమ్మలపాలెం(ఇబ్రహీంపట్నం): ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో భార్యాభర్తలు గాయపడ్డారు. మండలంలోని తుమ్మలపాలెం వద్ద 65వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం ఘటన జరిగింది. కొండపల్లి శ్రామికనగర్‌కు చెందిన వేముల శ్రీనివాస్ భార్యతో కలసి బైకుపై విజయవాడ వైపు వెళ్తున్నారు. తుమ్మలపాలెం వద్ద అదే గ్రామానికి చెందిన కె.మురళీకృష్ణ ఎన్టీటీపీఎస్‌లో విధులకు హాజరవడానికి రాంగ్‌రూట్‌లో వస్తూ శ్రీనివాస్ బైక్‌ను ఢీకొట్టాడు. శ్రీనివాస్‌తో పాటు అతని భార్య నడుముకు గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను

కొళ్లికుళ్ల(పెనుగంచిప్రోలు): రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. గ్రామంలో బుధవారం రూ.10.95 లక్షలతో సొసైటీ భవనం ఆధునికీకరణ, కాంపౌండ్ వాల్ నిర్మాణం, రూ.21.37 లక్షలతో మండల పరిషత్ పాఠశాలలో మౌలిక వసతుల పనులకు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు, రైతుకూలీ సంక్షేమం కోసం గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ముఖ్యమంత్రి పాలన జరుగుతోందన్నారు. ప్రతి గ్రామంలో ఆర్బీకేలను ఏర్పాటుచేసి రైతులకు అందుబాటులో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను ఉంచారన్నారు. నాడు నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలను కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా మార్చారన్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ వూట్ల నాగమణి, సర్పంచ్ జొన్నలగడ్డ కిషోర్, సొసైటీ అధ్యక్షుడు కోనంగి ముక్కంటి, కార్పొరేషన్ డైరెక్టర్లు బత్తుల రామారావు, చేనికుమారి, గ్రామ పార్టీ అధ్యక్షుడు రమేష్, జిల్లా ఎస్సీ సెల్ నాయకులు వేల్పుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



రూ.21 లక్షలతో పాఠశాలలో మౌలిక వసతుల పనులను ప్రారంభిస్తున్న ఉదయభాను

గ్రంథాలయాల్లో విజ్ఞానంతో పాటు వినోదం

కంచికచర్ల: వేసవికాలంలో విద్యార్థులు బయటకు వెళ్లకుండా ఉండేందుకు ప్రభుత్వం గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తోందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని శాఖా గ్రంథాలయ గ్రంథ పాలకుడు అల్లూరు రామచంద్రుడు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో రాష్ట్ర పౌర గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో బుధవారం విద్యార్థులకు పలు విభాగాల్లో ఆటలను నిర్వహించారు. అంతర్జాతీయ తల్లిదండ్రుల దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయిల్ మాట్లాడుతూ మన జీవితాల్లో అతిపెద్ద సహాయక వ్యవస్థ తల్లిదండ్రులున్న కుటుంబం అని అన్నారు. భవిత సెంటర్ ఐఈఆర్టీ ఉపాధ్యాయుడు ఎం.కనకారావు విద్యార్థులకు, డ్రాయింగ్, క్రాఫ్ట్ నేర్పించారు. డ్యాన్స్‌మాస్టర్ నవీన్ నాని డ్యాన్స్‌లతో పాటు యోగా నేర్పించారు. తదుపరి కవి నీలం సర్వేశ్వరరావు విద్యార్థులకు చిత్రలేఖనం నేర్పించారు.



కంచికచర్ల గ్రంథాలయంలో చిత్ర లేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మరొక రెండు రోజులు నీటి సరఫరా నిలిపివేత

మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు హెడ్‌వాటర్ వర్క్స్‌లో చేపట్టిన పైపులైన్, వాల్వ్ మరమ్మతు పనులు మరొక రెండు రోజుల పాటు కొనసాగుతాయని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పట్టణ సమీపంలోని హెడ్ వాటర్ వర్క్స్‌లో జరుగుతున్న పైపులైన్, వాల్వ్ మరమ్మతు పనులను పలువురు కౌన్సిలర్లు, ఇంజినీరింగ్ సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గత 30 ఏళ్ల నుంచి ఉపయోగిస్తున్న పైపులైన్లు పాడై శిథిలావస్థకు చేరడంతో యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులను చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు రెండు రోజుల పాటు తాగునీటికి తాత్కాలిక అంతరాయానికి సహకరించాలని కోరారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా వార్డుల్లో ప్రజలకు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్ కొలగాని రాము, నాయకులు కాశి కిషోర్, చిరంజీవి, మున్సిపల్ డీఈఈ శివకోటేశ్వరరావు, ఏఈ హనుమంతరావు, సిబ్బంది పాల్గొన్నారు.



హెడ్‌వాటర్ వర్క్స్‌లో మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, అధికారులు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నందిగామటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నందిగామ పట్టణాన్ని మునుపెన్నడూ లేనంతగా అభివృద్ధి చేస్తున్నామని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. పట్టణంలోని ఒకటి, రెండు, ఆరు వార్డులలో సాధారణ, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.66.91 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్లు, డ్రైన్‌లతో పాటు పలు అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ పట్టణంలో గత మూడు దశాబ్దాలుగా చేయని అభివృద్ధిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఈ నాలుగేళ్లలో చేసి చూపుతున్నామన్నారు. ఇప్పటికే పలు రహదారుల విస్తరణ, అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, పీఏసీఎస్ చైర్మన్ పాములపాటి రమేష్, మున్సిపల్ కమిషనర్ జయరాం తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

పశుగణాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు

వెల్లంకి(వీరులపాడు): పశుగణాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని పశుగణాభివృద్ధి సంస్థ సంచాలకుడు శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని వెల్లంకి గ్రామంలో బుధవారం లేగదూడల అందాల ప్రదర్శన-పశు విజ్ఞాన బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు పోషకులు పెయ్య దూడల విషయంలో నిర్లక్ష్యం వహించకూడదన్నారు. మొదటి మూడు, నాలుగు నెలల వయసు కీలకమైనదని, ఈ దశలో దూడలకు సరైన దాణా అందించాలని తెలిపారు. అంతే కాకుండా కృత్రిమ గర్భధారణ ద్వారా మేలు జాతి పశువులను అభివృద్ధి చేసి పాల ఉత్పత్తిని పెంచుకోవచ్చని సూచించారు. వైఎస్సార్ పశు బీమా పథకాన్ని ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. దీని వల్ల ప్రమాదాలతో పశువులు మృతి చెందితే బీమా ద్వారా ఆర్థిక సహకారం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో నందిగామ ఉప సంచాలకుడు వెంకటేశ్వరరావు, రాధాకృష్ణ, పశువైద్యాధికారి శంకర్ నాయక్, ఎంపీటీసీ సభ్యురాలు వేమిరెడ్డి కోటేశ్వరి, పలువురు రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంచాలకుడు శ్రీనివాసులు

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల చొరవతో దీర్ఘకాల సమస్యకు పరిష్కారం

నందిగామ: మండలంలోని లింగాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని విద్యుత్ లైన్‌లను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల చొరవతో విద్యుత్ శాఖ అధికారులు బుధవారం తొలగించారు. పాఠశాల ఆవరణ మీదుగా 12 కేవీ విద్యుత్ లైన్‌లు ఉన్నాయి. ముందు జాగ్రత్తతో వాటిని తొలగించాలని గత కొన్నేళ్లుగా విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులకు చెబుతున్నప్పటికీ పట్టించుకోలేదు. దీంతో గ్రామస్తులు సమస్యను ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన వారు విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి ఆ ప్రాంతం నుంచి విద్యుత్ లైన్‌లను తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో గ్రామస్తులు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు అభినందనలు తెలియజేశారు.

ప్రాధాన్యతాక్రమంలో అన్ని వార్డుల్లో రోడ్లు, డ్రెయిన్లు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణ అభివృద్ధిలో భాగంగా ప్రాధాన్యతా క్రమంలో పట్టణంలోని అన్ని వార్డుల్లో రోడ్లు, డ్రెయిన్లు ఏర్పాటుచేస్తామని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. పట్టణంలోని పలు వార్డుల్లో బుధవారం సుమారు రూ.6 లక్షలతో నూతనంగా ఏర్పాటుచేస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక ఆకులవారి వీధి, మార్కండేయ బజారు, అయ్యప్పస్వామి ఆలయం వీధిలో నిర్మిస్తున్న రోడ్ల పనులను ప్రారంభించినట్లు తెలిపారు. భవిష్యత్తులో పట్టణంలో మరిన్ని అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగమల్లేశ్వరరావు, కౌన్సిలర్లు సంగెపు బుజ్జి, గెల్లా సంధ్యారాణి, కంచేటి గీతారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు తన్నీరు నాగేంద్ర, శ్రీనివాస్, మునిని శివ తదితరులు పాల్గొన్నారు.



మార్కండేయ బజారులో సీసీ రోడ్డు నిర్మాణ పనుల శంకుస్థాపనలో పాల్గొన్న చైర్మన్ రాఘవేంద్ర

పార్కు నిర్మాణాన్ని పరిశీలించిన ఉదయభాను

పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలులో పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మాణం జరుగుతున్న పార్కును బుధవారం ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 20 వేల జనాభా కలిగిన గ్రామంలో ప్రజలు కాసేపు సేద తీరేందుకు ఇప్పటివరకు పార్కు లేకపోవడం బాధాకరమన్నారు. సర్పంచ్ వేల్పుల పద్మకుమారి గెలిచిన తరువాత ప్రత్యేక శ్రద్ధ పెట్టి గ్రామశివారులోని చెరువువద్ద సుందరమైన పార్కు నిర్మాణం జరుపుతున్నారన్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెనుగంచిప్రోలుకు ఈ పార్కు తలమానికంలా తయారుచేయాలని గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ వేల్పుల రవికుమార్‌కు సూచించారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ బాడిస పాపారావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



పార్కు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వవిప్ ఉదయభాను

గణపతి ఆలయాలలో ప్రత్యేక పూజలు

నందిగామ: సంకటహర చతుర్థి నేపథ్యంలో బుధవారం పట్టణంలోని పలు ఆలయాలలో గణపతికి ప్రత్యేక పూజలు జరిగాయి. సంకటహర చతుర్థి నాడు గణపతిని పూజిస్తే కష్టాలు తొలుగుతాయని భక్తుల నమ్మకం. ఈ నేపథ్యంలో పట్టణంలోని పాత బస్టాండ్‌లో గల పురాతన గణపతి ఆలయంలో స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. కాకుళ్లయ్య వీధిలోని గణపతి ఆలయంలో, స్థానిక రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలోని గణపతి ఆలయంలో, అయ్యప్ప ఆలయ ప్రాంగణంలోని గణపతి ఆలయంలో, గాంధీ నగర్ లోని గణపతి ఆలయాలలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు.

20 మంది వాహనదారులకు జరిమానా

కంచికచర్ల: వాహనాలు నడిపే సమయంలో విధిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ఎస్ఐ పీపీఎస్ సుబ్రహ్మణ్యం అన్నారు. లైసెన్స్‌లు, సంబంధిత పత్రాలు లేకుండా వాహనాలు నడుపుతున్న 20 మందికి బుధవారం రూ.1500 జరిమానా విధించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనాలను రాంగ్ రూట్‌లో నడపరాదని, వేగంగా నడపరాదని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని చెప్పారు. చిన్నపిల్లల చేతికి వాహనాలు ఇస్తే వాహన యజమానికి కూడా జరిమానా విధిస్తామని ఎస్ఐ తెలిపారు.

నందిగామకు చేరుకున్న ప్రచార జాత

నందిగామ: మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచార జాత బుధవారం నందిగామకు చేరుకుంది. ఈ సందర్భంగా పలువురు సీఐటీయూ నాయకులు కార్మికుల సమస్యలపై ప్రసంగించారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.